సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



ప్రతి కుటుంబానికి మేలు

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. కనపర్తిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

- 8లో..



జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపి మండలంలో పల్లెపల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమం నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
42/27

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఏపీ ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష హాల్ టికెట్స్ విడుదల

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని ఆరు మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్స్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 21న ఉదయం పది నుంచి 12 గంటలకు వరకు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. హాల్ టికెట్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. సంబంధిత ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఒంగోలులో భారీ చోరీ

- ఏటీఎం వాహనం నుంచి రూ.64 లక్షలు లూటీ!

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో పట్టపగలే దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం సెంటర్లలో నగదు నింపే వాహనం నుంచి చాకచక్యంగా రూ.64 లక్షలు కాజేశారు. ఈ సంఘటన ఒంగోలు ఆర్టీసీ డిపో పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డిపో సమీపంలో కర్నూలు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద పక్కనే ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో నగదు నింపేందుకు సీఎమ్ఎస్ సంస్థకు చెందిన వాహనం వచ్చింది. పెట్రోల్ బంక్ ఆవరణలో వాహనాన్ని నిలిపిన సిబ్బంది.. ఆఫీస్ రూమ్‌లో భోజనం చేసి తిరిగి వచ్చే సరికి సీఎమ్ఎస్ వాహనం తలుపులు తెరిచి ఉన్నాయి. రూ.64 లక్షలు చోరీ అయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు, డీఎస్పీ కిషోర్‌బాబు, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరించారు. పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరించిన ఓ వ్యక్తిని గురించారు. కాగా.. పట్టపగలు పెట్రోలు బంకు వద్ద జన సంచారం ఉన్న ప్రాంతంలో నగదు చోరీ కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



- నోటిఫికేషన్ విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్
- జిల్లాలో పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్లు మరూ
- భారీగా తరలివచ్చిన అభిమానుల మధ్య బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్
- కనిగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ ఒక సెట్ నామినేషన్ దాఖలు
- అఫిడవిట్ దాఖలు చేయని టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి

తొలిరోజు 13 నామినేషన్లు దాఖలు

గురువారం దశమి, తొలి రోజు మంచి ముహూర్తం కావడంతో జిల్లా వ్యాప్తంగా 13 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో పార్లమెంట్ నియోజకవర్గానికి నాలుగు, అసెంబ్లీ నియోజకవర్గాలకు తొమ్మిది నామినేషన్లు సమర్పించారు. పార్లమెంట్‌కు సంబంధించి ప్రస్తుత ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన సతీమణి మాగుంట గీతాలత విడివిడిగా చెరొక నామినేషన్ వేశారు. అయితే పార్టీ ఇచ్చే బీ-ఫాం, ఏ-ఫాంలు కానీ, అఫిడవిట్ కాని అందచేయకుండానే నామినేషన్లు వేశారు. వీరి తోపాటు స్వతంత్ర అభ్యర్థులుగా బూచి ఏడుకొండలు, బొడ్డు క్రాంతి కుమార్ కూడా నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు.

సార్వత్రిక సంగ్రామానికి గంట మోగింది..

సాక్షిప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికలు-2024లకు నగారా మోగింది. ఈ ఎన్నికలకు సంబంధించి గత నెలలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు గురువారం కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ నోటిఫికేషన్‌ను ప్రకాశం భవన్‌లో విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదలతో పాటుగా నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి విధులు నిర్వర్తిస్తారు. ఒంగోలు పార్లమెంట్‌కు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో తమ నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంది. అదేవిధంగా అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేయాలనుకునే అభ్యర్థులు ఆయా నియోజకవర్గ కేంద్రంలో తమ నామినేషన్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంది.

దర్శిలో బూచేపల్లి నామినేషన్:

దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి వైఎస్సార్ సీపీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి అభిమానులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారితో ర్యాలీగా వెళ్లి దర్శి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు సమర్పించారు. బూచేపల్లి శివప్రసాద రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, బూచేపల్లి సతీమణి నందిని కూడా వైఎస్సార్‌సీపీ తరఫున రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఏఆర్‌ఓ వద్ద దాఖలు చేశారు. అదేవిధంగా కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ తరఫున దద్దాల నారాయణ యాదవ్ ఒక సెట్ నామినేషన్‌ను కనిగిరి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఒంగోలు శాసనసభ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఎ.శంకర్‌రెడ్డి, గిద్దలూరులో ఈవీ సురేష్ బాబు, కొండపిలో శ్రీపతి సతీష్, ఎస్ఎన్‌పాడులో కైకాల వెంకటరావు, దర్శిలో మీనా మంచా, పుట్లూరు కొండారెడ్డి నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు.

నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 26వ తేదీ పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. నామినేషన్లు జరిగే సమయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థితోపాటు నామినేషన్ దాఖలుకు ఆర్‌ఓ వద్దకు అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే అనుమతించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ వ్యవహరించారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి, వెంకాయమ్మ, నందిని



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

వ్యయ పరిశీలకునిగా దూకే బిశ్వాస్



దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు దూకే బిశ్వాస్

ఒంగోలు అర్బన్: జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకునిగా దూకే బిశ్వాస్ నియమితులయ్యారు. గురువారం ప్రకాశం భవనంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బిశ్వాస్ జిల్లాలో ఒంగోలు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకునిగా వ్యవరించనున్నారు.

నేడు జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు

- జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర

ఒంగోలు సెంట్రల్: జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు శుక్రవారం జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర తెలిపారు. స్కూల్ స్థాయి విజేతల వివరాలు తప్పనిసరిగా ప్రేరణ పోర్టల్‌లో నమోదు చేసి వారి స్కూల్ డైస్ కోడ్‌తో లాగిన్ అయి ఆన్‌లైన్ చేయాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. విజేతల వివరాలన్నింటినీ సంబంధిత ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో పంపాలని చెప్పారు. స్టూడెంట్, ఎస్కార్ట్ టీచర్లు ఐడెంటిటీ కార్డుతో సహా శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొనే వారు డ్రాయింగ్ కలర్స్, ప్యాడ్ మొదలైనవి వారి వెంట తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు మండల విద్యాశాఖాధికారిని, సమగ్రశిక్ష వారిని సంప్రదించాలని కోరారు.

ఐదేళ్లలో జనరంజక పాలన

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి
- సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప ముంగిటకే పాలన
- ఒంగోలును ఎంతగానో అభివృద్ధి చేశా...
- 16వ డివిజన్‌లో మన ఒంగోలు-మన వాసన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని



16వ డివిజన్ అగ్రహారం గేట్ పోతురాజుపాలెంలో నిర్వహించిన 'మన ఒంగోలు మన వాసన్న' ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగించారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బాలినేని మన ఒంగోలు-మన వాసన్న కార్యక్రమంలో భాగంగా బాలాజీ నగర్‌లో గురువారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని బాలినేని చేపట్టారు. 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణంతో కలిసి అగ్రహారం గేటు అవతల సుగుణారావు కాలనీ నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి బాలాజీ నగర్ మొత్తం పర్యటించారు. ఈ సందర్భంగా బాలినేనికి స్థానికులు హారతులు, పూల వర్షంతో, గుమ్మడి కాయలు దిష్టి తీసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమం రెండూ రైలు పట్టాల మాదిరిగా సీఎం వైఎస్ జగన్ కొనసాగించారన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సీమలకు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పరిపాలనను గ్రామాల్లోనే కొనసాగించారన్నారు. ఒంగోలు నగరాన్ని ఎంతగానో అభివృద్ధి చేశానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను అఖండ మెజారిటీతో గెలిపించి ఆరోసారి గెలిపించి తనచేత సిక్సర్ కొట్టించాల్సిన బాధ్యత ఒంగోలు నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. 16వ డివిజన్‌లో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి ఇంటి వద్ద బాలినేని వివరించారు. సీఎం వైఎస్ జగన్ నవరత్నాల పథకం ద్వారా నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేసి ఆదుకున్నారన్నారు. నగరంలో ఇళ్లులేని నిరుపేదలకు 25 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, వచ్చిన వెంటనే 25 వేల మందికి ఇళ్లు కట్టించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు పోట్లూరి భాస్కర్, అడపాల రాము, వాకా కృష్ణా రెడ్డి, టీ రాజేష్, పురిణి ప్రభావతి పాల్గొన్నారు.

కనిగిరి గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా..

- కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం
- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

కనిగిరి రూరల్: ''మనమంతా సమష్టిగా, సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం.. కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగురేద్దాం.. కనిగిరి గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందాం'' అని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి పార్టీ నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి బాబురావు మాట్లాడుతూ టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా 2024లో కాబోయే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డేనన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉన్నారని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ నేత చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సామాజిక న్యాయంలో భాగంగానే వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా దద్దాల నారాయణ యాదవ్‌ను సీఎం ప్రకటించినట్లు చెప్పారు. సీఎం జగన్ తనకు ఎంతో మంచి అవకాశాలు కల్పించారని, తానే వెళ్లలేదని స్పష్టం చేశారు. దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ జిలాని, కౌన్సిలర్లు చింతం శ్రీను, ఎస్‌కే ఫయాజ్, ఎస్‌కే సందాని, గఢ మస్తాన్‌వలి, పెన్నా ఏడుకొండలు, ఎస్‌కే ఖాజా, సయ్యద్ రిజ్వానా ఖాలక్, ఎస్‌కే బజాజ్ బుజ్జీ, ఏఎంసీ డైరక్టర్లు బొట్టు శ్రీను, రహిమాన్, పార్టీ యూత్ పట్టణ, మండల అధ్యక్షుడు డాక్టర్ రసూల్, మాలీ యాదవ్, నాయకులు పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, ఎం వెంకటేశ్వరరెడ్డి, డీ మాలకొండారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, మన్సూర్, కే రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్శి రూపురేఖలు మార్చేస్తాం

- బూచేపల్లిని ఆశీర్వదించండి
- మంచి వ్యక్తి నా తమ్ముడు మీ శివన్న
- ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- ఆశీర్వదించండి.. సేవలందిస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: దర్శి నియోజకవర్గాన్ని మేమిద్దరం కలసి అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తామని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం దర్శి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట రాజంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా హాజరైన వేలాది మంది ప్రజానీకంతో కలసి ర్యాలీగా దర్శికి చేరుకున్నారు. దారిపొడవునా క్రేన్‌ల సాయంతో భారీ గజమాలలు వేసి హారతులిచ్చి దుశ్శాలువాలు కప్పి, పూలుచల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు వాయిద్యాల మధ్య కార్యకర్తల నినాదాలతో దర్శి పట్టణం మారుమోగింది. ప్రజలందరి ఆశీర్వాదాలు తీసుకుని నామినేషన్‌కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా హాజరైన భారీ జనసందోహాన్ని ఉద్దేశించి చెవిరెడ్డి మాట్లాడుతూ దర్శి ప్రాంతానికి బూచేపల్లి కుటుంబం 20 ఏళ్లుగా చేస్తున్న సహాయ సహకారాలే శివప్రసాద్‌రెడ్డి ని గెలిపిస్తాయన్నారు. ఎక్కడా అవినీతి మచ్చలేని వ్యక్తి, సేవచేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన శివప్రసాద్‌రెడ్డి లాంటి వ్యక్తులను గెలిపించుకుంటేనే నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నామినేషన్‌కు వచ్చి ఎర్రని ఎండలో తమకోసం ఎదురు చూస్తూ ఉన్న వేలాది మంది జనసందోహాన్ని చూస్తుంటే బూచేపల్లి కుటుంబం పై నియోజకవర్గ ప్రజలకు ఎంతటి మమకారం ఉందో అర్థమవుతోందన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్

చంద్రగిరిని అభివృద్ధి చేసినట్లుగా మేమిద్దరం కలసి దర్శి నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పార్టీలకతీతంగా పథకాలు అందించారని..మీకు మేలు జరిగితేనే నాకు ఓటెయ్యండనే దమ్మున్న నాయకుడుగా దేశ చరిత్రలో ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉన్నారన్నారు.

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు 'రా కదలిరా' అంటే జనాలు రావడం లేదు కానీ కరువు మాత్రం వస్తుందని దర్శి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. రైతులను, మహిళలను మోసం చేయడమే చంద్రబాబు అజెండా అని తెలిపారు. 2014లో ఇచ్చిన 600 హామీలు అటకెక్కించి ప్రజలు ప్రశ్నిస్తారని ఆన్‌లైన్‌లో కూడా లేకుండా చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు ఇచ్చిన మాట కోసం హామీలను 99 శాతం అమలు చేసి ప్రజా సంక్షేమమే లక్ష్యం గా పాలన అందించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో చెరువులన్నింటికీ నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఆయన సహాయ సహకారాలతో దొనకొండ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న ఈ యుద్ధంలో సీఎం వైఎస్ జగన్ పేదల పక్షాన నిలబడ్డారన్నారు. దివంగత ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దీవెనలతో దర్శి ప్రజల ఆశీస్సులతో ఈరోజు నామినేషన్ దాఖలు చేశానన్నారు. మా కుటుంబం పై ప్రేమతో దర్శి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. ఇంతటి అభిమానాన్ని పంచుతున్న మీకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీపీ సుధా అచ్చయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్ కాప్ డైరెక్టర్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.

సాధారణ కార్యకర్తలా బైక్ పై వచ్చిన చెవిరెడ్డి:

నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి సామాన్య కార్యకర్తగా ర్యాలీలో పాల్గొన్నారు. తెల్లలుంగీ, చొక్కా ధరించి మోటారు సైకిల్‌పై వచ్చారు. తనతోపాటు వచ్చిన కార్యకర్తలు అభిమానులతో కరచాలనం చేస్తూ భాస్కరరెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న చెవిరెడ్డిని బూచేపల్లి గమనించి వాహనంపైకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌కు స్వచ్ఛందంగా తరలివచ్చిన అభిమానులు

జనసంద్రంగా దర్శి పట్టణం

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌కు వేలాదిగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ముందుగా రాజంపల్లి గ్రామంలో మూసీ నది తీరాన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జరిగిన ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారిపొడవునా భారీ గజమాలలతో బూచేపల్లికి స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాజంపల్లి గ్రామంలో ప్రత్యేక టీం నృత్యాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొత్తరెడ్డి పాలెం గ్రామానికి చేరుకున్న సందర్భంగా మహిళలు హారతులిచ్చారు.



శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డికి హారతులిస్తున్న మహిళలు

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి (మర్రిపూడి): జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి అభ్యర్థి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని గొడుగులపాలెం, దాసిరెడ్డిపాలెం, ముక్కోడిపాలెం గ్రామాల్లో గురువారం పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమంలో పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. టీడీపీ అధికారం కోసం కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని, ఆ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. 2014 టీడీపీ అధికారంలోకి ఉన్న సమయంలో ప్రజలకు ఒక్కటంటే ఒక్క పనిచేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చెప్పుకోవడానికి ఒక్క మంచి పని కూడా లేదన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ మురళి, కొండపి సొసైటీ అధ్యక్షుడు ఉపేంద్ర చౌదరి, మండల నాయకులు బొక్కిసం సుబ్బారావు, హరినారాయణ, శేఖరెడ్డి, నారాయణ, కొర్నేలు, వెంకటాద్రి, వేముల రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, చింతల వెంకటేశ్వర్లు, సత్యం పంతులు, నరాల చిన్నబ్బాయి యామవరపు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

కొండపిలో రజక సంఘ నాయకుడు యామవరపు వసంతరావు ఆధ్వర్యంలో మంత్రి ఆదిమూలపు సురేష్ సమక్షంలో 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నగర నడిబొడ్డు దిగ్బంధం



ప్రకాశం భవనం వద్ద బారికేడ్లు పెట్టి రోడ్లు దిగ్బంధం



ప్రకాశం భవనం వద్ద పోలీసుల పహారా

● నామినేషన్ల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు
● వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు
● గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధింపు
● ముందస్తు సూచనలు చేయకుండానే..

ఒంగోలు సబర్బన్: ఎన్నికల నిబంధనల పేరుతో నగరంలో తీవ్ర ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నగర నడిబొడ్డు ప్రకాశం భవన్, చర్చి సెంటర్లను పూర్తిగా దిగ్బంధించడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఎటువంటి ముందస్తు సూచనలు చేయకుండానే పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో ఒక పక్క భానుడి ప్రతాపం, మరోపక్క పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ పత్రాల స్వీకరణలో భాగంగా నగరానికి కేంద్ర బిందువును పోలీసులు పూర్తిగా ఇనుప బారికేడ్లతో మూసేశారు. కనీసం పోలీసులు ముందస్తుగా నగర ప్రజలకు సూచనలు కూడా చేయకుండా రాత్రికి రాత్రి అష్ట దిగ్బంధం చేయటంతో గురువారం ఉదయం నుంచి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహనదారులు ఇక్కట్లు చెప్పేవీ కావు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలకు ఒంగోలు నగర పోలీసులు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. గతంలో ఎన్నికల సందర్భంగా ప్రకాశం భవన్ ముందు, ఆర్డీఓ కార్యాలయం ముందు ట్రాఫిక్ ఆంక్షలు విధించేవారు. కానీ ప్రస్తుతం మాత్రం పోలీసులు నగరంలోని ప్రధాన రహదారులను దిగ్బంధించారు. ట్రంకురోడ్డును మిరియాలపాలెం సెంటర్ వరకు మూసేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు చర్చి సెంటర్ నుంచి మిరియాలపాలెం వరకు దుకాణాలను పూర్తిగా మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు రోడ్డును పూర్తిగా ఇనుప బారికేడ్లతో మూసేశారు. అటు సీవీఎన్ రీడింగ్ రూము నుంచి హెచ్‌సీఎం కాలేజీ వైపు వచ్చే రోడ్డును కూడా మూసేయంతో అటు ప్రజలు, ఇటు వాహన దారుల ఇక్కట్లు వర్ణణాతీతంగా మారింది, చర్చి సెంటర్ నుంచి ఇటు రైల్వేస్టేషన్‌కు వెళ్లే కలెక్టర్ బంగ్లా రోడ్డును రాకపోకలకు నిలువరించారు. మిరియాలపాలెం సెంటర్ వరకు ఉన్న దుకాణాలు, హెచ్‌సీఎం సెంటర్ నుంచి సీవీఎన్ రీడింగ్ రూమ్ వరకూ ఉన్న వ్యాపారస్తులు కూడా దుకాయాలను మూసేశారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి ఏబీఎం కాలేజీ మీదుగా వెళ్లే వన్‌వే ట్రాఫిక్ రోడ్డు కాస్తా టూ వే రోడ్డుగా మారడంతో తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రకాశం భవనంలో పని చేస్తున్న ఉద్యోగులు సైతం కార్యాలయానికి వెళ్లేందుకు, తిరిగి బయటకు వచ్చేందుకు ఇక్కట్లు పడ్డారు. తాము ప్రకాశం భవనంలో పనిచేస్తున్నామని చెప్పినా విధుల్లో ఉన్న సిబ్బంది కనికరించకపోవడంతో వారంతా చుట్టూ తిరిగి కార్యాలయాలకు చేరుకోవాల్సి వచ్చింది. ఎన్నికల నిబంధనల పేరుతో పోలీసులు నగర ప్రజలకు మొదటి రోజే చుక్కలు చూపించారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ చక్ర బంధం నుంచి నగర ప్రజలను కాపాడాలని వేడుకుంటున్నారు.

టీడీపీ బూటకపు చేరికలు

చీమకుర్తి రూరల్: జిల్లాలో టీడీపీ అసత్య ప్రచారం జోరుగా కొనసాగుతోంది. గత రెండు రోజులుగా మండలంలోని గాడిపర్తివారిపాలెంలో టీడీపీకి చెందిన వారికే పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలో నుంచి టీడీపీలో చేరుతున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారు. గాడిపర్తివారిపాలెంలో 3 కుటుంబాలు టీడీపీలో చేరితే, టీడీపీ సంబంధించిన ఎల్లో పత్రికల్లో 25 కుటుంబాలు చేరాయని ప్రచురించారు. వాస్తవానికి పంబ శివ, గండి సిమోను, పంబ రాజేష్ కుటుంబాలు మాత్రమే టీడీపీలోకి చేరారు. టీడీపీ నాయకుడు గొట్టిపాటి రాఘవరావు ఆధ్వర్యంలో టీడీపీకి వారికే కండువాలు కప్పి ప్రచారం చేయసాగారు.

వినియోగదారులకు ఉచిత సేవలు

● భారతి సిమెంట్ డిప్యూటీ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి



వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేనేజర్లు

ఒంగోలు సిటీ: భారతి సిమెంట్ వినియోగదారులకు ఇంటి వద్దే ఉచితంగా టెక్నికల్ సేవలు అందజేయనున్నట్లు కంపెనీ డిప్యూటీ మేనేజర్లు డి.ప్రతాప్‌రెడ్డి, ఎన్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. భారతి సిమెంట్ కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన మొబైల్ కన్‌స్ట్రక్షన్ అడ్వైసోరీ వ్యాన్‌ను గురువారం వారు ప్రారంభించారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువల గురించి వినియోగదారులకు ఇంటి వద్దే తెలియజేస్తామని పేర్కొన్నారు. టెక్నికల్ ఆఫీసర్ వి.సాంబశివారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు మాటలు నమ్మొద్దు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తాటిపర్తి చంద్రశేఖర్

● వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: చంద్రబాబు బూటకపు హామీలను నమ్మితే ప్రజలు మునిగిపోతారని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని రామచంద్రకోట, కడపరాజుపల్లె, జమ్మిదోర్నాల, హసానాబాద గ్రామాల్లో గురువారం మన ఊరికి మన చంద్రశేఖరన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఆయా గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. జగన్‌మోహనరెడ్డి అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుంచుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వెన్నుపోటు రాజకీయాల్లో దిట్టన్నారు. తన రాజకీయ స్వలాభం కోసం సొంత మామనే మోసం చేసిన వ్యక్తి అని విమర్శించారు. అలాంటి వ్యక్తి పేదల ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను అందించడంలో బాబు విఫలమయ్యారన్నారు. బాబు హయాంలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం ఇతర పార్టీలతో జతకట్టడం ఆయన నైజమని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలను, రాష్ట్రాభివృద్ధిని ఆయన ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధిని పట్టాలెక్కించారని చెప్పారు. పేదల బాగు కోసం ఎన్నో సంక్షేమ పథకాలను గడప వద్దకే తెచ్చి ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లోని మహిళలతో మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. టీడీపీకి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్లేనని, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసుకున్నట్టేనని వివరించారు. రానున్న ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిత్తూరి హారిక, దర్శనం యేహాన్, కొంగరి వెంకట్రామయ్య, నాయకులు వెన్నా వెంకిరెడ్డి, వెన్నా కాశిరెడ్డి, వెన్నా మల్లారెడ్డి, గుండారెడ్డి వెంగళరెడ్డి, తాతిరెడ్డి సుబ్బారెడ్డి, గోనుగుంట్ల నాగేశ్వరరావు, సింగా నాగేశ్వరరావు, వట్టి శ్రీనివాసరెడ్డి, బత్తినేని రామకృష్ణ, ఒంటేరు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు చిన్న ఆవులక్క, ఒంటేరు పెద్ద ఆవులయ్య, మాజీ జెడ్పీటీసీ అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ దూదేకుల కాశింపీరా, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, పవన్‌కుమార్, యక్కంటి వెంకట్వేశ్వరరెడ్డి, చంద్రకాంత్‌నాయక్ జోగి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు



కనపర్తిలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు అభ్యర్థి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని కనపర్తి గ్రామంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన మేరుగు నాగార్జున కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ పరిధిలోని చిన్నంగారి పట్టపుపాలెంలో రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కనపర్తి పంచాయతీలో గతంలో ఎన్నడూ లేని విధంగా నాయకులంతా సమన్వయంగా ముందుకు వచ్చారన్నారు. జగనన్న పాలన మెచ్చి ఇప్పటికే కనపర్తి గ్రామ పరిధిలో సుమారు 200 కుటుంబాలు పార్టీలో చేరడంతో పార్టీకి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుందన్నారు. మన నాయకుడు జగనన్న పరిపాలనలో ఇప్పటికే కనపర్తిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. భవిష్యత్‌లో కూడా గ్రామస్తులంతా కలిసికట్టుగా ముందుకు సాగి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన మేలును ప్రతి నాయకుడు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎన్నికలు అయ్యే లోగా ప్రతి నాయకుడు గ్రామంలో ఒక్కో ఇంటిని కనీసం మూడు సార్లయినా సందర్శించి జగనన్న చేసిన మేలును వివరించి ఆయనకు అండగా ఉండాలని కోరాలన్నారు. ఈ సందర్భంగా కనపర్తి గ్రామంలో మేరుగు నాగార్జునకు మహిళలు ఆశీర్వాదాలు తెలిపి హారతులిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లికార్జునరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, మారెళ్ల కిరణ్, హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, వైఎస్ ఎంపీపీ కన్నా రాధ, త్రినాథ్‌రెడ్డి, కుక్కల గోపిరెడ్డి, జయసింహారెడ్డి, నారపరెడ్డి, తాతిరెడ్డి, మసనం రాఘవరావు, సామ్యేలు, అంజయ్య, సుందరరామిరెడ్డి, రాజనీడి రాముడు, చాట్ల కిరణ్, వల్లంశెట్టి ఆంజనేయులు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు విఫల నాయకుడు

● 2014–19లో ఒక్క హామీనీ నెరవేర్చలేదు
● మళ్లీ జన్మభూమి కమిటీలను పెడతాననే దమ్ముందా?
● ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

పొదిలి రూరల్ : చంద్రబాబు 2014–19 వరకు తన పాలనలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా విఫలమయ్యాడని వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ రీజినల్ డిప్యూటీ కో–ఆర్డినేటర్, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. పొదిలిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు తిరుపతి నుంచి విశాఖ వరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి వరాల జల్లు కురిపించారని గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని, ప్రపంచ రాజధానిగా అమరావతిని నిర్మిస్తామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులిస్తామని చెప్పి ఎన్నికల ప్రచారం చేశారని తెలిపారు. విభజన హామీలైన స్టీల్ ప్లాంట్, రామాయపట్నం పోర్టు, రైల్వే జోన్, రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం.. లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి 2014లో ఓట్లడిగి అధికారంలోకి వచ్చినట్టు చెప్పారు. కానీ చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చినపాపాన పోలేదన్నారు. మీ హామీలపై ఎక్కడైనా చర్చించడానికి సిద్ధమని సవాల్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు అదనంగా డబ్బులు ఇస్తామని అబద్ధపు మాటలు చెబుతున్నారే తప్ప.. కొత్త పథకాలేవని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తామని చెప్పగలరా.. అంటూ నిలదీశారు. మతాలు, కులాల పేరుతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన వ్యక్తి చంద్రబాబని మండిపడ్డారు. అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగల మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టారని, బీసీలకు, కాపులకు గొడవ పెట్టాడని దుయ్యబట్టారు. ప్రకాశం జిల్లాలో దళితుల భూముల లాక్కుంది, విశాఖ జిల్లాలో దళిత మహిళను అవమాన పరిచింది మీరు కాదా అని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ అభ్యర్థి బహిరంగ సభలో మీరు ఓట్లు వేయకపోతే చచ్చిపోతానని చెప్పడమంటే.. ఓటమిని అంగీకరించడమేనన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఒంగోలు పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ అభ్యర్థులు గెలుస్తారని సుధాకర్‌బాబు స్పష్టం చేశారు.

అక్క ఆనందం కోసం బావ హత్య

● బావను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన బావమరిది

రాచర్ల: అక్క కళ్లలో ఆనందం చూడటానికి తమ్ముడు హంతకుడిగా మారాడు. తన బావనే ఘోరంగా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేశాడు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా ఈ ఉదంతం వెలుగు చూసింది. ఈ నెల 14న మండలంలోని యడవల్లి హైవేక్రాస్ రోడ్డు వద్ద గిద్దలూరు మండలం, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి (43) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఖాజావలి భార్య షేక్ హస్మత్ అదే రోజున స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మార్కాపురం డీఎస్పీ ఆదేశాల మేరకు గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్సై వి.హరిబాబు దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా కేసు ఛేదించారు. వివరాలు.. గిద్దలూరు పట్టణంలోని కొప్పువారివీధిలో నివాసం ఉంటున్న షేక్ ఖాజావలి బావమరిది షేక్ అబ్దుల్ సుభాని అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఖాజావలి మద్యానికి బానిసై, సుభాని అక్కను మానసికంగా, శారీరకంగా హింసించడం పరిపాటిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న సుభాని ఇంట్లోనే బావ ఖాజావలి.. డబ్బులు ఇవ్వాలంటూ భార్య హస్మత్‌ను వేధించసాగాడు. ఇతని ప్రవర్తనతో విసిగిపోయిన సుభాని ఇక బావను భరించడం తన వల్ల కాదని అతన్ని అంతమొందించాలని నిశ్చయించుకున్నాడు. బావను వాహనంలో ఎక్కించుకుని బయలుదేరాడు. రాచర్ల మండలంలోని యడవల్లి సమీపంలోని మోటు–గిద్దలూరు హైవే రోడ్డుపై తన వాహనాన్ని ఆపి అంబులెన్స్ హెడ్‌లైట్స్ వెలగడం లేదని, దిగి చూడమని మద్యం మత్తులో ఉన్న తన బావ షేక్ ఖాజావలికి చెప్పాడు. ఖాజావలి దిగి వాహనం ముందుకు వచ్చి లైట్లు చూస్తుండగా ఒక్కసారిగా నిందితుడు షేక్ అబ్దుల్ సుభాని తన అంబులెన్స్ ముందుకు కదలించాడు. కింద పడిపోయిన ఖాజావలి తలపై నుంచి అంబులెన్స్‌ను పోనిచ్చి చంపాడు. అయితే ఇది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. పోలీసులు తమ సాంకేతిక విచారణలో ఈ విషయం గుర్తించి నిందితుడు షేక్ అబ్దుల్ సుభానిని బుధవారం అరెస్టు చేసి, గురువారం గిద్దలూరు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్సై వి.హరిబాబు తెలిపారు. కేసు ఛేదించిన గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్సై వి.హరిబాబుతో పాటు రాచర్ల పోలీస్ సిబ్బందిని మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు అభినందించారు.

65 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

ఒంగోలు సబర్బన్: నగరంలోని వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు ఆయా డివిజన్లలోని వార్డు సచివాలయాల అడ్మిన్‌లకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి వారి మద్దతు బాలినేనికి ప్రకటించారు. రాజీనామాలు చేసిన వారిలో 46వ డివిజన్‌కు చెందిన వాలంటీర్లు 25 మంది, 23వ డివిజన్ వలంటీర్లు 17 మంది, 8వ డివిజన్ క్రిస్టియన్ పాలెంకు చెందిన వార్డు సచివాలయం వలంటీర్లు 23 మంది ఉన్నారు. బాలినేని వలంటీర్లకు ధైర్యాన్ని ఇచ్చి, ఏ అవసరమైనా తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. చంద్రబాబు కుట్రలకు వలంటీర్లు బలయ్యారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే తొలి సంతకం వలంటీర్ల నియామకంపైనే పెడతానని ప్రకటించిన విషయాన్ని బాలినేని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో పాటు స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బాలినేనిని కలిసిన రాజీనామా చేసిన 46వ డివిజన్ వలంటీర్లు



23వ డివిజన్ వలంటీర్లు



8వ డివిజన్ వలంటీర్లు